# చచ్చి సాధించలేవు

అది అందమైన భవంతులతో కూడిన సుందరమైన నగరం. నగరం సుందరంగా వున్నంత మాత్రాన అక్కడ ట్రాఫిక్‌లో జరిగే యాక్సిడెంట్సు సుందరంగా వుండవు కదా. అలాగే ఇంత అందమైన పట్టణంలోనూ, క్షణంలోనో, అరక్షణంలోనో కూలిపోయే గోడలున్న పాడుపడ్డ కొంపలూ వున్నాయి.

కెమెరాను లాంగ్‌షాట్‌లోంచి తప్పించి, మెయిను బజారులో శర వేగంతో పరుగెత్తించి, రైల్వేలైనును క్రాసుచేసి, పట్టణాన్ని రెండుగా చీలుస్తూ పిచ్చిదాని తలమీది మధ్య పాపిడిలా ప్రవహిస్తున్న మురికాలువను బ్రిడ్జి మీదుగా దాటించి, కుడివైపు వీధిగుండా వెళ్ళి, ఎడమ వైపు సందులోకి తిరిగి, అక్కడ్నుంచిఎనిమిదో ఇంటి దగ్గర కెమెరా క్లోజప్‌లో ఆగిపోయింది.

పెచ్చులూడిపోయి రాలుతున్న గోడలు. దానికి ఆనుకొనే సిమెంటు లేచిపోయి గుంటలు పడ్డ అరుగు వుంది. అరుగు మీద బుద్ధుడిలా కూర్చొని ఉన్నాడు గుర్నాథం. ఒళ్ళో ఏడాది పిల్లవాడు కూర్చొని వున్నాడు. ప్రక్కనే నాలుగేళ్ళ పిల్ల నిలబడి వుంది. ఎదురుగా ఇద్దరు కొడుకులు. పుస్తకాల సంచీలు తండ్రి కెదురుగా వుంచి వీధిలో గోళీ కాయలాడుకుంటున్నారు. ఇద్దర్లో ఒకడికి తొమ్మిది సంవత్సరాల వయ సయితే. ఇంకొకడు ఏడేళ్ళవాడు. గుర్నాథం వళ్ళో పిల్లవాడు అరుగు మీద ఉన్న గుంటల్లోంచి మట్టి ఏరుకుతింటూంటే, నాలుగేళ్ళ పిల్ల గోడ మీద పెచ్చుల్ని చేతితో పెళ్ళగిస్తూ వుంది.

ఇంతలో షాట్ రెడీ అన్నట్లుగా గుర్నాథం భార్య దుర్గమ్మ వీధి వాకిట్లోకి వచ్చి ప్రాత్రలోని నీళ్ళు వీధిలో పారబోసింది. "హోర్ని... ఏందయ్యోయ్ ఏందిది?..." అంటూ మొదటగా క్రిందికి దిగి వీధిలో గోళీలాడుతున్న ఇద్దరు పిల్లల్ని చెవిమెలిత్రిప్పి వీపుమీద నాలుగు వడ్డించింది. దాంతో వాళ్ళు కుయ్యో, మొర్రో అంటూ సంచులు సంకకు తగిలించుకొని పరుగెత్తుకు వెళ్ళారు.

షెచ్చులు పెళ్ళగిస్తున్న నాలుగేళ్ళ పిల్లను రెండుబాది, గుర్నాథం వళ్ళో పిల్లవాడ్ని లాక్కొంది. వాళ్ళ ఏడుపులకు, దుర్గమ్మ అరుపులకు ఈ లోకంలోకి వచ్చి, తిట్లను దీవెనలుగా భావించి, మౌనంగా లోపలకు నడిచాడు.

* * * *

ఆలస్యంగా వచ్చిన గుర్నాధాన్ని హెడ్‌క్లర్కు ఉరిమిచూశాడు. అటెండెన్సు రిజిష్టరు హెడ్‌క్లర్కు టేబులుమీద లేదు. అక్కడ్నుంచి ఆఫీసరు గదివరకూ దొంగలా నడిచాడు గుర్నాథం. ఇతన్ని చూస్తూనే స్టూలుమీద కూర్చుని ఉన్న ప్యూను పళ్ళికిలించాడు. ప్యూను మిగతా స్టాపు అందరికీ నమస్కారాలు పెడుతూంటాడు. కారణం వాళ్ళప్పుడప్పుడూ రూపాయో అర్ధరూపాయో ఖర్చుకు ఇస్తుంటారు. మరయితే గుర్నాథం ఇవ్వడు. గుర్నాథం ఆకారం చూస్తే వాళ్ళకసలు అడగాలనే బుద్ధి పుట్టదు. జాలిగా చూస్తుంటారు.

"లోపలకు దయచేయండి" అన్నాడు ప్యూను. అతను ఇలాంటి అవకాశం కోసం ఎదురు చూస్తుంటాడు. వాళ్ళను లోపలకు పంపించి, లోపల అయ్యగారు తిట్టేవన్నీ తలుపు ఓరగా తెరిచి వింటాడు. మధ్యాహ్నం లంచవర్లో అందరికీ చెప్పి ఆనందింప చేస్తుంటాడు. ఆఫీసరు

ప్యూను కనుక ఎవరూ ఏమీ అనలేరు. కారణం అఫీసరుకు లేనిపోని చాడీలు చెప్పి ఇంకా తిట్టిస్తాడని.

గుర్నాథం లోపలికి వెళ్ళేసరికి ఆఫీసరు పేపరు చూస్తున్నాడు. గుర్నాథం ఆయన కెదురుగా చేతులు కట్టుకొని నిలబడ్డాడు.

చాలా సేపటికి తలెత్తిన ఆఫీసరు "ఏమయ్యా గుర్నాథం? ఏం కావాలి?" అనడిగాడు.

"సార్! ఇంట్లో కొద్దిగా పనుండి ఆఫీసు టయానికి రాలేక పోయాను సార్! తమరు అటెండెన్సు రిజిష్టరు ఇస్తే సంతకం పెడ్తాను"

ఆఫీసరు వాటీ చూసుకొని, "ఏమయ్యా! బాధ్యతగల ఉద్యోగివై యుండి. గంట లేటుగా వస్తావా" అన్నాడు ఉగ్రుడౌతూ.

"లేదుసార్! నేను ఆఫీసుకు అరగంట క్రితమే వచ్చాను. తమరి రూములోకి వచ్చి మరో అరగంట అయింది"

"అయితే అరగంట ఆలస్యం, ఆలస్యం కాదంటావా! అయినా ఎందుకవుతుందయ్యా రోజూ అలస్యం"

"పెద్ద సంసారం పిల్లాజెల్లా గలవాణ్ని. క్షమించండి సార్"

"అయితే నీకేనంటావా పెళ్ళాం పిల్లలూ ఉండేది. మాకందరకూ లేరా" హూంకరించాడు ఆఫీసరు.

ఇంటిదగ్గర తన భార్యకూడా 'ఆఫీసరుకు పెళ్ళాం పిల్లలు లేరా?' అంటుంది. ఇక్కడ అఫీసరూ అదేమాట అంటున్నాడు. అయితే అక్కడ భార్య అనే మాటల్లో భావం 'అతనికి బాధలు తెలుసుకదా' అని ఇక్కడ అఫీసరు అన్న మాటల్లో భావం 'మేము ఇన్‌టైంలో వస్తున్నాం కదా' అని.

"చిత్తం" అన్నాడు గుర్నాధం మరేం అనలేక.

"మిస్టర్ గుర్నాథం పెళ్ళాం పిల్లలు ఎక్కువ ఉంటే ఆఫీసుకు ఆలస్యంగా రమ్మని ఎక్కడా జి వో లేదు. నేనిన్ని రోజులు ఎలాగో సహించాను. ఇక వీలుకాదు. ఈ రోజు నీకు హాఫ్ డే ఆబ్సెంట్ వేస్తున్నాను. ఆఫీసులో డిసిప్లెయిన్ లేకపోతే నేను సహించను. ఇక నీవు వెళ్ళవచ్చు" అన్నాడు ఆఫీసరు. తల వంచుకుని బయటకొచ్చాడు గుర్నాధం.

ఇంక ఇంటికిపోయినా బాధలు తప్పవు. అక్కడి గయ్యాళి భార్యతో, యమకింకరుల్లాంటి పిల్లలతో క్షణం వేగలేడు. అందుకే ఆ రోజు ఆఫీసులో పనిచేయ నిశ్చయించుకొన్నాడు.

లంచ్ అవర్లో గుర్నాధానికి జన శృంగభంగం జరిగింది జరిగి నట్లు చెప్పి స్టాఫు నందర్నీ నవ్వించాడు ప్యూను. గుర్నాధం మనసు విరక్తితో నిండిపోయింది. తనకు ఇంట్లో విలువలేదు. ఆఫీసులోనూ విలువలేదు

సాయంత్రం నాలుగు గంటలప్పుడు ఆఫీసరు పిలుస్తున్నాడంటూ ప్యూను వచ్చి చెప్పాడు.

గుర్నాధం లోపలికి వెళ్ళేసరికి ఆహారం కోసం ఎదురు చూసే గండు పిల్లిలా ఖస్సున మండిపడ్డాడు ఆఫీసరు.

"ఏమయ్యా ఇది ఫైలా లేక సెక్స్ నవలా! ఒక ఉద్యోగి రిటై రయితే పెన్షన్ ఫిక్స్ చేసి ప్రపోజల్సు పంపడం చేతకాదు. ఏం కాలిక్యు లేషన్సయ్యా! అసలు నువ్వు స్కూలు ఫైనలు ఎలా పాసయ్యావో ఆ దేముడికే తెలియాలి. నా ప్యూన్కు నీకు పెద్ద తేడాలేదు. వాడు స్కూలు ఫైనలు ఫెయిలైన ఖర్మానికి ప్యూనయ్యాడు. నువ్వు పాసయిన ఖర్మానికి

మమ్మల్నిలా బాధిస్తున్నావు నువ్వు పెన్షను ఫిక్స్‌చేసింది బి.సి. కాలం నాటి జి.వో.ను బట్టి దాంతర్వాత సవాలక్ష జి.వోలు పుట్టుకొచ్చాయి. సరిగ్గా చూసి ఫైలు పెట్టు" అంటూ గుర్నాథం జవాబు కోసం కూడా ఎదురు చూడకుండా ఫైలు గిరాటేశాడు.

గుర్నాథం భద్రంగా క్రిందపడ్డ ఫైలందుకొని 'చిత్తం' అని వెను దిరిగాడు.

ఆఫీసరు తిడుతూండే అన్నీ విన్న ప్యూను, తనకు రావలసిన ఉద్యోగమేదో అతను కొట్టేసినట్లు గుర్నాథం వైపు ఈర్ష్యగా చూశాడు.

ఆ రోజు సాయంత్రం ఆఫీసు వదిలిం తర్వాత రోడ్డున పడ్డాడు గుర్నాథం. అతని మెదడులో విష క్రిమి ప్రవేశించి తొలిచేస్తూ వుంది. ఆఫీసులో ఆఫీసరు తిట్లు, ఇంట్లో పెళ్ళాం తిట్లు గుర్తుకొచ్చి జీవితం మీద విరక్తి పుట్టింది. తను ఈ జీవితం నుంచి తప్పుకొంటే ఎంత బాగుం టుంది. మనిషి చనిపోతే ఏమయిపోతాడో ఏమో-అదొక తియ్యని అను భూతి నిశ్శబ్దంగా మరణించడం అంత హాయి మరొకటి లేదు. ఈ లోకంలో జరిగే మోసాలు తను చూడలేడు. కష్టాలు ఇక పడడు.

గుర్నాథం 'ప్రసాద్ ఎరువుల డిపో' అనే బోర్డున్న షాపులో కెళ్ళి చెట్లకు చీడపట్టిందని ఓ డబ్బా పురుగుల మందు కొని మళ్ళీ రోడ్డు మీదికి వచ్చాడు.

"హల్లో గురూ! ఏదో క్రిమిసంహారక మందు కొన్నట్లున్నావ్. మీ ఇంట్లో మందుకు కూడా అంగుళం ఎత్తు మొక్కదొరకదే మందు దేనికి" అంటూ పలకరించాడు మిత్రుడు రామారావు.

గుర్నాథం తత్తరపడుతూ, "మందా! ఛ...ఛ...మాకుదేనికి? ఫ్రెండొకడు ఉంటే మాట్లాడి వస్తున్నా" అన్నాడు.

"ఓహో! అలాగా నాక్కొద్దిగా పనుంది. నే వెళ్ళొస్తా" అంటూ రామారావు ఎదురుగా వున్న సందులోకి వెళ్ళాడు.

తరువాత గుర్నాథం గాంధీ పార్కువైపు నడిచి, పచ్చికలో కూర్చొని ఎలా చావాలి అనే విషయం మీద ఒక ప్లాను తయారు చేశాడు. యింటి దగ్గర ఎలాగూ కుదరదని, సంచీ లోంచి ఓ తెల్ల కాగితం తీసి రెండుగా చించాడు. మొదటి కాగితంలో తన చావుకు తన గయ్యాళిభార్యే కారణమని, అది తట్టుకోలేకనే తను చచ్చిపోతున్నానని వ్రాసాడు. రెండవ దాంట్లో తన ఆఫీసరు తనను హెరాస్ చేస్తున్నాడని, తన ఆత్మహత్యకు అదొక కారణమని వ్రాసాడు. ఒక్క సారి తృప్తిగా చదువుకొని క్రింద సంతకాలు పెట్టాడు.

గుర్నాథం ఇంటికి రాగానే పూర్వీకులు కట్టిన డాబాఎక్కి, ఖాళీగా ఉన్న పూల తొట్టిని బోర్లించి అందులో తను తెచ్చిన డబ్బా దాచాడు. అందరూ తననేదో ప్రత్యేకంగా చూస్తున్నట్లు భావించాడు. కాని అదేమిటో ఆశ్చర్యకరంగా ఆరోజు గుర్నాధాన్ని పల్లెత్తు మాట అనలేదు దుర్గమ్మ. ఒక క్షణం అతనికి జీవితం మీద ఆశ కలిగినా, అది శాశ్వతం కాదని నిర్ణయించుకున్నాడు.

రోజులా అటొకడ్ని, ఇటొకడ్ని వేసుకొని కుక్కిమంచంలో పడుకోలేదు గుర్నాథం. భోజనం చేసి చాప తీసుకొని డాబా మీదికి చేరాడు. జేబులో తను వ్రాసి వుంచిన కాగితాలు ఒకసారి తడిమి చూసుకొని డబ్బా మూత త్రిప్పాడు. అది తేలిగ్గానే వచ్చింది. వెంటనే గటగటా త్రాగేసాడు. డాబా మధ్యగా చాప మీద పడుకొని ఆ చీకట్లో ఆకాశాన్ని చూస్తున్నాడు.

క్రమేణా కడుపులో త్రిప్పడం మొదలు పెట్టింది. మెదడు ఏదో మత్తులోకి జారుతున్నట్లుగా ఉంది. 'ఆహా మందు పనిచేస్తుంది' అను

కొన్నాడు గుర్నాథం. అలా అనుకొంటూండగానే సర్వావయవాలు తమ కార్యక్రమాలకు గుడ్ బై చెప్పేసాయి.

## 2

గుర్నాధాన్ని రెండు ఆకారాలు అరక్కా, ఈరెక్కా పుచ్చుకొని, ఆకాశంలోకి లాక్కెలుతున్నాయి. అనంతమైన ఆకాశంలోకి దూసుకు పోతూ క్రిందికి చూసిన గుర్నాధానికి భూమి సగం వెలుతురూ, సగం చీకటితో అర్ధచంద్రాకృతిలో ఓ ఫుట్‌బాలంత సైజులో కనిపిస్తూ వుంది. క్రమేణా అదికూడా అదృశ్యమైపోయింది.

"ఎవరు మీరు? నన్నెక్కడికి తీసుకువెలుతున్నారు?" అడిగాడు గుర్నాథం.

"మమ్మల్ని చూస్తే తెలియడంలా! మేము యమకింకరులం."

గుర్నాథం పరీక్షగా చూశాడు. వాళ్ళు సరిగ్గా కనిపించడంలేదు. ఫోటోలో నెగిటివ్‌లులాగా మసక మసగ్గా కనపడీ కనపడకుండా వున్నారు ముఖాలు కర్కశంగా భయంకరమయిన కోరలతో ఉన్నట్లనిపిస్తున్నాయి. గుర్నాథం తన కేసి చూసుకొన్నాడు. తనూ ఒక సీదలా ఉన్నాడు. ఒక భౌతికరూపం లేదు.

కొద్దిసేపటికి సింహాసనం మీద ఠీవిగా కూర్చొన్న యమధర్మ రాజు ముందు నిలబెట్టారు. "అరె ఈయన పోయినేడు హైదరాబాదు నుంచి ఆఫీసు ఇనస్పెక్షనుకొచ్చిన డైరెక్టరులా ఉన్నాడే" అనుకొన్నాడు. చిత్రగుప్తుడు తన పుస్తకంలో ఒక పేజి తెరచి గుర్నాథం చేసిన పాపా లను వరుసగా చదివాడు.

యమధర్మరాజు అంతా విని, తల పంకించి "వీడు చేసిన ఘోర పాపాలన్నిటికీ గుమస్తాగా చేరి శిక్ష అనుభవించాడు. కాని ఇంకా ఒక పాపం మిగిలివుంది. అదేమిటంటే వాళ్ళాఫీసు గుమాస్తా ఏకకంఠం చని పోతే ఫెన్షను ఫిక్స్‌చేస్తూ ఒక రూపాయ తగ్గించివేశాడు. వీడు చేసిన ఈ పొరపాటుకు ఏకకంఠం భార్య ప్రతినెలా రూపాయ తక్కువ పొందుతూ వుంది. కనుక వీణ్ని ఓ నెలరోజులపాటు వేడి నూనెలో ఉడక పెట్టండి" అన్నాడు.

అంతే...క్షణంలో గుర్నాధం ఆత్మ ఎవరో విసిరి కొట్టినట్లు సల సల కాగే నూనెలో పడింది. గుర్నాధానికి భౌతికంగా శరీరం లేదనే గాని అతను పడాల్సిన బాధంతా పడ్డాడు. ఆ నెలరోజులూ నరకాన్ననుభ వించాడు అక్కడ. శిక్ష పూర్తికాగానే మరలా అతన్ని రివ్వున ఆకాశం లోకి తీసుకుపోసాగారు.

కొద్ది దూరం పోయిన తర్వాత ఆకాశంలోనే తెల్లగా బార్డర్‌లా వున్న చోట ఆగారు. అక్కడ ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్లు దిక్కులు చూస్తున్నారు యమదూతలు. కొంత సేపటికి ఓ పూలపల్లకి వచ్చింది. అందులోంచి తెల్లని దుస్తుల్లో అందంగా కన్పిస్తోన్న ఇరువురు వ్యక్తులు దిగారు. వాళ్ళను చూడగానే యమదూతలు తమ జేబులోంచి, రెండు కాగితాలు తీసిచ్చారు.

ఆ తెల్లని దుస్తుల్లో వున్న వ్యక్తులు ఒక కాగితాన్ని తాము తీసు కుని, రెండో కాగితం మీద సంతకాలు పెట్టారు గుర్నాధం ఆత్మ ముట్టినట్లు.

"మేం దేవ దూతలం. మిమ్మల్ని స్వర్గానికి తీసుకుపోతాం. పూల పల్లకి ఎక్కండి" అన్నారు ఎంతో మర్యాదగా!

గుర్నాథం పూలపల్లకి ఎక్కగానే ఆశ్చర్యకరంగా అతనికి సుందర రూపం వచ్చేసింది. ఈడ్చి తన్నిన బంతిలా పూలపల్లకి పైకెగిరితే, రాలిన తాటి పండుల్లా యమదూతలు క్రిందికి జారారు.

స్వర్గానికి అధిపతి అయిన దేవేంద్రుడు, గుర్నాధాన్ని తన ముందుంచగానే దేవదూతల చేతుల్లోంచి కాగితం తీసుకొని దానిమీద ఏదో వ్రాసి ఇచ్చాడు.

"గుర్నాథంగారూ! మిమ్మల్ని 'ది సిటీ ప్లానింగ్ ఆఫీసు'లో యల్.డి గుమాస్తాగా వేసారు" అన్నారు దేవదూతలు ఇంద్ర సభనుండి బయటికి నడిపిస్తూ-

"స్వర్గానికి వచ్చినా ఈ గుమాస్తాగిరీ తప్పలేదే! అంతకాడికి దీన్ని సర్గమనడం దేనికి" మనసులోనే గొణుక్కున్నాడు గుర్నాథం.

ఇక్కడే గుర్నాథం అంచనాలు తారుమారయ్యాయి ఇతను డ్యూటీలో జాయినవుదామని ఆ ఆఫీసుకు బయలుదేరదామని ఆఫీసు కాంపౌండ్‌లో అడుగు పెట్టగానే ఆఫీసర్లు, మిగతా స్టాఫు అంతా వచ్చి ఇతన్ని పూలదండలతో ముంచెత్తివేశారు. అందరూ అతనికి అటూ ఇటూ భయం భయంగా నడుస్తున్నారు. గుమస్తాకు ఇంత సన్మానం జరుగుతూందంటే ఆశ్చర్యంగా వుంది గుర్నాధానికి. ఇంతకంటే ఆశ్చర్యం అతని రూము. అది ఏ.సి చేసి వుంది. వెడల్పయిన పెద్ద టేబులు కుషన్ చైరు టేబుల్‌మీద నాలుగు ఫోనులు ఉన్నాయి. ఆఫీసర్ల బలవంతం మీద అక్కడ కూర్చొన్న గుర్నాధానికి ఎవరో కితకితలు పెట్టినట్లయ్యింది. ఎప్పుడూ విరిగిపోయిన చెక్క కుర్చీలో కూర్చొనే గుర్నాథం ఆ మెత్తదనాన్ని భరించలేక ఒక్క క్షణం సరిగ్గా కూర్చోలేకపోయాడు. సీనియర్ యు డి. గుమాస్తా ఒకాయన ఆఫీసంతా తిప్పి అందర్నీ పరి

చయం చేసాడు. ఆఫీసర్లందరూ ఒకే ఒక పెద్ద హాల్లో కూర్చొంటారు అందరికీ పాత టేబుళ్ళు పాతకుర్చీలే. వాళ్ళ వెనుకనున్న బీరువాలు ఫైళ్ళతో నిండి వున్నాయి. అందరూ యల్ డి గుమాస్తా గుర్నాధానికి వంగి వంగి నమస్కారాలు చేసారు. ఆఫీసర్లందరూ బీదరికం ఉట్టిపడే దుస్తులు ధరించి ఉన్నారు. అందరి ముఖాలు దైన్యంగా వున్నాయి.

తరువాత యు డి. గుమాస్తాల రూములు చూపించాడు అవి ఒక్కొక్కరికి ఒక్కో రూము ప్రత్యేకంగా ఉన్నాయి. అయితే అవి గుర్నాధం స్పెషల్ రూములా ఏ.సి. చేసి లేవు. తరువాత తనను పరిచయం చేసుకొన్నాడు. అప్పటివరకూ అందర్నీ పరిచయం చేసిన యు.డి. గుమాస్తా తాను ప్రస్తుతమున్న అందరు యు. డి గుమాస్తాల్లోకి సీనియర్ అని. తనకు త్వరలో యల్ డి. గుమాస్తా ప్రమోషను వస్తుందని చెప్పుకున్నాడు.

గుర్నాధం తన సీట్లోకి వెళ్ళి కూర్చోగానే అడ్మినిస్ట్రేషను గురించి కొంత వివరించి చెప్పాడు ఆయన. "సార్ మీరు తొందరపడి ఆఫీసర్లు వ్రాసుకొచ్చిన కాగితాలన్నిటినీ అప్రూవ్ చేయవద్దు. చాలా తప్పులుంటాయి. వాళ్ళు మరీ సోమరులయిపోయారు. రాత్రి పది గంటలవరకు పని చేస్తున్నామంటారేగాని కాగితాలు కదలవు వాళ్ళనో కంట కనిపెట్టి వుండండి. మేము యు డి సి లం కాబట్టి మాకంతగా భయపడరు. మీరు యల్ డి గుమాస్తా కదా మీకు వాళ్ళ ఉద్యోగం ఉంచాలన్నా ఊడబెరకాలన్నా పుల్ పవర్స్ ఉంటాయి. అందుకని మీ మాట వింటారు." గుర్నాధం కున్న పవర్స్ వివరించి వెళ్ళిపోయాడు యు డి. గుమాస్తా.

గుర్నాధానికి తల గిర్రున తిరగ సాగింది. భూలోకానికి, స్వర్గలోకానికి అడ్మినిస్ట్రేషను వ్యవహారంలో ఇంత వ్యతిరేఖమా అని.

లోపల ఓ ఆఫీసరు గుర్నాథం టేబులుమీద అటెండెన్సు రిజిష్టర్ పెట్టి వెళ్ళిపోయాడు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఇక్కడ ఆఫీసుల్లో ప్యూనులు లేరు. గుర్నాథం అన్ని పేర్లు చెక్‌చేసి ఒక పేరు దగ్గర ఆప్సెంటు మార్కు వేశాడు. గుర్నాథం తనకున్న పవర్ని తలచుకొని ఉబ్బిపోయాడు.

ఈ లోపల వగర్చుకొంటూ వగర్చుకొంటూ లోపలకు ప్రవేశించిన ఒక ఆఫీసరు గుర్నాథానికి రెండు చేతులెత్తి నమస్కరించాడు. "సార్! అలస్యమైపోయింది. పదిమంది పిల్లలు గలవాణ్ని రక్షించండి" అన్నాడు.

"అయితే ఏమంటావ్" అన్నాడు గుర్నాథం హుందాగా కాళ్ళాడిస్తూ.

ఆ వచ్చిన ఆఫీసరు ఏదో చెప్పబోయాడు ఇంతలో టేబులు మీదున్న రెండు ఫోనులూ మ్రోగాయి. కుడిచేత్తో ఒకటి, ఎడమ చేత్తో ఒకటి ఎత్తి రెండు ఫోను కాల్సుకూ జవాబిస్తూ ఓ అరగంటసేపు మాట్లాడాడు. అంతా అయిం తర్వాత ఆఫీసరు మళ్ళా తన సొద వెళ్ళబోసుకున్నాడు.

"సార్! నా కొంపలో సుఖశాంతులు లేవుసార్! సంసారం పెద్దది! పదిమంది పిల్లలు వాళ్ళ బాగోగులు చూసి ఆఫీసుకు వచ్చేసరికి లేటయిపోతూ ఉంది. నన్ను కొద్దిగా గమనించి పోతూండండి సార్" బ్రతిమలాడుతున్న ధోరణిలో అడిగాడు ఆఫీసరు.

"మాకు లేవటయ్యా సంసారాలూ! కొంపలూ!" అనబోయి తనకు లేవని తెలుసుకుని "అవన్నీ నాకు తెలియదయ్యా! డిసిప్లెయిను అంటే డిసిప్లెయినే. సమయానికి రాకపోతే జీతం విరగ్గోస్తాను. అయామ్

ఎ వెరీ స్ట్రిక్ట్ క్లర్క్. మీకు ఎప్పుడో అప్పెంటు మార్కు వేసేశాను. ఇక మీరు వెళ్ళొచ్చు" అన్నాడు గుర్నాధం. ఆఫీసరు గుర్నాధం వైపు దీనంగా చూసి తల దించుకొని వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోయిం తర్వాత టేబుల్ మీదున్న ఛార్టు గుర్నాధాన్ని ఆకర్షించింది. ఆ ఛార్టులో ఒక కాలమ్‌లో ఒకటి నుంచి వంద వరకూ, రెండవ కాలమ్‌లో ఒకటి నుంచి వెయ్యి వరకూ నంబరులు వున్నాయి. మొదటి కాలమ్ హెడ్డింగు భార్యలు అని, రెండవ కాలం హెడ్డింగు పిల్లలు అని వ్రాసి ఉంది. గుర్నాధం భార్యల కాలమ్‌లో రెండూనూ, పిల్లల కాలంలో నాలుగూనూ టిక్కిచ్చాడు. అంటే ఇప్పుడు గుర్నాధం క్రొత్త కాపురంలో ఇద్దరు భార్యలూ, నలుగురు పిల్లలూ ఉంటారన్న మాట

ఇంతలో ఒక ఆఫీసరు నెమ్మదిగా ప్రవేశించి తన చేతిలోని ఫైలు గుర్నాధం టేబులుమీద పెట్టి నమస్కారం చేశాడు. గుర్నాధం ఫైలు తెరచి పైన్నుంచి క్రిందివరకూ చదివి విసిరి నేల కేసి కొట్టాడు. "ఏమయ్యా ఈ ఇంగ్లీషు ఎక్కడ నేర్చావు. డ్రాఫ్టు అంతా తప్పులు. నేను కొన్ని కొర్రీస్ వేశాను. వాటికి సావధానంగా రిప్లయిస్ వ్రాసి తీసుకురా తరువాత అప్రూవ్ చేస్తాను" అన్నాడు.

"చిత్తం" క్రిందపడి చెల్లాచెదురయిన కాగితాలను ఏరుకొని నమస్కారం చేసి బయటకు నడిచాడు ఆఫీసరు. గుమాస్తాగారు ఏం కొర్రీలు వేసారోనని భయంగా ఉంది ఓ వైపు.

తరువాత ఒకరి తరువాత ఒకరుగా ఆఫీసర్లు ఫైళ్ళు తీసుకొని రావడం, గుర్నాధం తప్పులు చూపించి వాళ్ళని నానా రకాలుగా తిట్టి పంపడం చేస్తున్నాడు. అందరూ వినయంగా నమస్కారం చేసి వెళ్ళిపోతున్నారు.

సాయంత్రం నాలుగవుతుందనగా గుర్నాథం ఓరగా తన గది తలుపులు తెరచి ఆఫీసర్లుండే హాల్లోకి తొంగి చూశాడు. ఆఫీసర్లంతా తమ తమ సీట్లు వదిలి ఒకచోట గుంపుగా చేరారు. కొంతమంది టేబులుమీద కాళ్ళు వ్రేలాడేసి కూర్చుని ఉన్నారు.

"ఛ...ఛ...ఈ గుమాస్తా దగ్గిర మనం ఒక్కరోజు పని చేయలేంరా"

"అబ్బెబ్బె...రోజురోజుకూ బాండెడ్ లేబర్‌లమైపోతున్నాం"

"రోజూ రాత్రి పదిదాకా చేయమంటే మనం చేయగలమా"

"ప్రతిదానికీ ఆ గుమాస్తాగారికి అంత కోపమైతే ఎలారా"

"మొత్తానికి భలే మొగుడు దొరికాడ్రా మనకు"

"ఒరేయ్ ఆయన గబుక్కున హాల్లోకి వచ్చి సర్ప్రైజ్ విజిట్ అన్నా అనగలడు జాగ్రత్తపడండి" అంటూ ఒకడు టేబులు మీది నుంచి క్రిందికి దూకాడు.

అందరి మనసుల్లోనూ తాము ఆఫీసర్లగా ఎందుకు అయ్యామా అనే బాధ ఉంది. ఏ గుమాస్తాగానో అయితే హాయిగా ఆఫీసును చేతిలో పెట్టుకొని నడపవచ్చు.

అంతవరకూ వాళ్ళ మాటలువిన్న గుర్నాధానికి ఒళ్ళు మండింది. తనను భూలోకంలో ఆఫీసర్లు పెట్టిన బాధలన్నీ గుర్తుకొచ్చాయి. విసురుగా హాల్లోకి వెళ్ళాడు. అందరూ బిక్కచచ్చిపోయారు అప్పటికే చాలా మంది తమ తమ సీట్లలో కూర్చొని ఉన్నారు. చివరగా ఇద్దరు తమ సీట్లలోకి పోతున్నారు. ఇద్దర్నీ పేర్లడిగి నోట్ చేసుకొన్నాడు.

లోపలకు వెళ్ళి బెల్ కొట్టగానే అతని పర్సనలు ఆఫీసరు వచ్చి ఎదురుగా నిలబడ్డాడు. అతను తన తోటి ఉద్యోగస్థులకు అన్యాయం జరుగుతుందని బ్రతిమాలుతున్నా వినకుండా నిలబడి ఉన్న యిద్దరు ఆఫీసర్లకూ సస్పెన్షను ఉత్తర్వులు వేశాడు గుర్నాథం.

ఇది తెలిసి ఆఫీసంతా గగ్గోలయింది. కాని గుర్నాధానికి భయపడి కుక్కిన పేనుల్లా ఐపోయారు. ఐదు గంటలవుతుందనగా వెళదామని ఆఫీసు వరండాలోకి వచ్చాడు గుర్నాథం. అతనిని అనుసరించి ఫైల్సు మోసుకొని వస్తున్న పర్సనలు ఆఫీసరు "తమరు ఎక్కండి సార్" అన్నాడు.

ఎదురుగా ఏ.సి. చేసిన ఇంఫాలా కారు ఉంది. ఆఫీసరు డోర్ తెరిచి పెడితే గుర్నాథం ఠీవిగా ఎక్కాడు.

కదలిపోతున్న కారు అద్దంలోంచి వెనక్కి తిరిగి చూసిన గుర్నాధానికి ఆఫీసర్లు కొందరు సైకిల్ స్టాండ్‌లోంచి డొక్కు సైకిళ్ళు బయటికి తీయడం కనిపించి విరగబడి నవ్వుకొన్నాడు.

రోజులు గడిచిపోతున్నాయి. గుర్నాధానికి ఆనందంగా ఉంది. పెద్ద బంగళా, ఇద్దరు భార్యలూ, నలుగురు పిల్లలూ, తనను చూసి భయపడి చేతులెత్తే ఆఫీసర్లు, తనకు అసిస్టెంట్లుగా యు.డి. గుమాస్తాలు. కాని ఆ ఆనందం ఎంతోకాలం నిలవలేదు.

ఇద్దరు ఆఫీసర్‌ల సస్పెన్‌షనుకు నిరసనగా ఆఫీసర్లంతా నిరాహార దీక్ష ప్రారంభించారు. ఓ నెలనుంచి వాళ్ళ గుండెల్లో మరుగుతున్న బాధను ఆ విధంగా బయటపెట్టారు.

ఆఫీసర్‌ల యూనియన్ నాయకుడు గుమాస్తా గుర్నాథంతో సంప్రతింపులు జరపడానికి వచ్చాడు. స్ట్రయిక్ మానమన్నాడు గుర్నా

థము. స్ట్రయిక్ ఆపేది లేదన్నాడు ఆఫీసరు. అయితే మిమ్మల్ని కూడా సస్పెండ్ చేస్తా' అన్నాడు. "చెయ్యి చూస్తా" అన్నాడు ఆఫీసరు.

అంతే గుర్నాధానికి ఒళ్ళు మండి చెయ్యిచాచి ఒక్క లెంపకాయ ఇచ్చాడు ఆఫీసర్ని.

• • • •

ఆ దెబ్బకు గుర్నాథం చేయి పగిలిపోయింది. డాబామీద ఎండ చుర్రుమనిపించింది. కళ్ళు తెరిచి సూర్యకాంతిని తట్టుకోలేక చేయి అడ్డు పెట్టుకొన్నాడు. గతం మననం చేసుకొని తను స్వర్గంలో లేనని, డాబా మీద తొమ్మిది గంటల ఎండలో పడుకున్నానని తెలుసుకొన్నాడు. కల్తీ మందు తనకు పనిచేయ లేదని తిట్టుకొని, తూలుతూ మెట్లు దిగాడు గుర్నాథం.

గుర్నాథాన్ని చూడగానే, ప్రక్కనే పిల్లలను కూర్చోబెట్టుకుని, నెత్తిన చెంగేసుకొని ఏడుస్తున్న భార్య—

"నాకిట్టాంటి భర్తనెందుకిచ్చావు దేముడో, ఈళ్ళందర్నీ నా ఎదన దోసి ఎల్లాలను కొన్నాద్రో దేవుడో..." అంటూ గుర్నాథంవైపు తిరిగి "నువ్వు చచ్చేప్పుడు మాకూ ఇంత విషం పెట్టి పుణ్యంకట్టుకో బాబో..." అంటూ రిథిమికల్‌గా ఏడ్చింది దుర్గమ్మ,

ఆమె చేతిలో తను నిన్న పార్కులో వ్రాసిన కాగితం వుంది.

బోనులోంచి తప్పుకొన్న ఎలుకలా ఇవేమీ పట్టనట్టు ఆఫీసుకు జారుకొన్నాడు. చకచకా కాలకృత్యాలు ముగించి, సీట్లో కూర్చొనీ కూర్చోగానే 'ఆఫీసరు పిలుస్తున్నా'డంటూ వచ్చి పళ్ళికిలించాడు. ప్యూన్ 'అఫ్ట్రాల్ ఆఫీసరంటే తన సబార్డినేట్ గదా' అని మొదట అనుకుని, అంతలో యదార్థం గుర్తుకొచ్చి, ఆఫీసర్ గదిలోకి పిల్లిలా దూరాడు.

"ఏమిటిది?" అంటూ ఓ కాగితం అందించాడు ఆఫీసరు. అది రాత్రి తన ఆత్మహత్యకు ఆఫీసరు కారణం అని వ్రాసిన రెండో ఉత్తరము.

"మిస్టర్ గుర్నాథం! నీవు చచ్చి మమ్మల్ని సాధించాలనుకోన్నావు. కాని నిన్న సాయంత్రం నీతో ఏదో మాట్లాడిన రామారావు ఎదో అనుమానంతో నిన్ను ఫాలో అయ్యాడు. ఈ విషయం నీ భార్యతో చెప్పి, పాయిజన్‌కు బదులు మత్తుమందు అక్కడ పెట్టారు..." అన్నాడు.

గుర్నాథం ముఖం దీనంగా వేడికి కరిగే మైనపు ముద్దలా అయ్యింది.

ఆఫీసరు తన వాక్ప్రవాహాన్ని మరలా కొనసాగించాడు. "నువ్వు ఆఫీసులో పబ్లిక్ సర్వెంటుని ఇంట్లో ఫామిలీ సర్వెంటువి. నేనో నగ్న సత్యం చెప్పనా, నీవు సంతోషంగా ఉండాలంటే...నీకంటే ఎక్కువ తిట్లు తినేవాడ్ని, బాధలు పడేవాడ్ని గురించి ఆలోచించు అంతేగానీ నీ కంటే ఆనందంగా వున్నవాడ్ని, ఐశ్వర్యం ఉన్నవాణ్ణి, స్టేటస్ ఉన్న వాణ్ని నీతో కంపేర్ చేసుకోకు. అప్పుడే నీకు జీవితంలో సుఖశాంతులు వెల్లివిరుస్తాయి" గీతోపదేశం చేశాడు.

"చిత్తం. తమరి దయ" అన్నాడు గుర్నాథం అన్నిటికీ తలాడిస్తూ.

"చిత్తం అంటూనే రేపొద్దున ఆత్మహత్య చేసుకొని నా మీదకు త్రోసివేయగలవు...అందుకే ఇందులో ఉన్నదంతా వేరే కాగితంలోకి వ్రాసి సంతకం పెట్టివ్వు" అంటూ టేబుల్ డ్రాయర్ లాగి అందులో నుంచి ఏదో వ్రాసి వుంచిన కాగితం, ఓ తెల్లకాగితం తీసి టేబుల్ మీద ఉంచాడు.

గుర్నాథం మారు మాట్లాడకుండా అందులో ఉన్నదంతా తెల్ల కాగితం మీద వ్రాసి సంతకం పెట్టాడు.

ఆఫీసరు అది అందుకొని పెద్దగా చదివాడు.

"...నేనే కారణంచేతనయినా చనిపోయినా, ఆత్మహత్య చేసుకొన్నా అందుకు నా ఆఫీసరుగారైన శ్రీ చిదంబరంగారికి ఎట్టి సంబంధం లేదు. ఇట్లు గుర్నాథం"

ఆఫీసరు దాన్ని టేబుల్ డ్రాయరులో వేసుకొంటూ ఫక్కున నవ్వాడు.

"ఇటీజ్ షార్ మై సేఫ్ సైడ్. నీ భార్యకు కూడా రామారావు ఇదే సలహా ఇచ్చాడు. నీవు ఇంటికి వెళ్ళేసరికి నీ భార్య కూడా ఇలాంటి హామీ పత్రమే సిద్ధం చేసుకొని ఉంటుంది. ఇక నీవు చచ్చినా, చచ్చి సాధించలేవు" తెరలు తెరలుగా నవ్వసాగాడు ఆఫీసరు.

గుర్నాధానికి ఏడ్చే స్వాతంత్ర్యం కూడా లేదిప్పుడు. ఎవరెన్ని హింసలు పెట్టినా జీవశ్చవంలా పడి ఉండాల్సిందే.

తనే వాళ్ళకు వ్రాతపూర్వకంగా లైసెన్స్ ఇచ్చేసాననుకొన్నాడు సగటు జీవి గుర్నాథం.

✱